శక్తిని మీ హృదయము లోపల అన్వేషించండి( ఏప్రియలు 2002)

ఆనందము అనేది ఆధ్యాత్మికత యొక్క ఒక మహత్వపూర్ణమైన ఉపలబ్ధి. ఆధ్యాత్మికదృష్టిలో చూసినప్పుడు ఆనందానుభూతిని పొందిన వ్యక్తి స్థితి ఉన్నతమైనది అని భావించబడుతుంది. ఈప్రకారంగా బాహ్యంలో చిఱునవ్వుతో వికసించిన మోమును సర్వసామాన్యంగాకూడా మనము చూస్తూనే ఉంటాము. కానీ అది భౌతికతతో జోడించబడిన కారణంగా అస్థిరమైనది, దానిలో హెచ్చుతగ్గులు వస్తూనే ఉంటాయి. అయితే ఆనందము అనేది ఆత్మికమైనది అయిన కారణముచేత చిరస్థాయిగా ఉంటూ సమతాస్థితిలో అనుభూతిలో కొస్తూ ఉంటుంది.

సాధారణంగా ఆనందము-ప్రఫుల్లతా రెండూ ఒకటేనని భావిస్తూ ఉంటారు. కానీ రెంటి మధ్యా భూమ్యాకాశాలకున్నంత భేదమున్నది. సూర్యచంద్రుల కాంతులలో ఉన్న తేడా ఇక్కడ గోచరిస్తుంది. సుమారు ఇటువంటి భేదము రెంటండి మధ్యా ఉన్నదని భావించాలి. బాహ్యవస్తువులలో మనము ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు మనకు సుఖానుభూతి కలుగుతుందో అది వాస్తవానికి మన హృదయానంద ప్రకాశము తప్ప మరేమీ కాదు. ఎందుకంటే బాహ్య కారణభూత తత్త్వముతో ఎన్నడూ సుఖము చేకూరదు. వాటిద్వారా లభించేది దుఃఖము మాత్రమే! ఒకవేళ భౌతికపదార్థములు ఆనందానికి మూలమై ఉండి ఉంటే, ఒక వస్తువు లేక పదార్థము ద్వారా ఒక వ్యక్తికి ప్రసన్నత లభిస్తే, రెండవ వ్యక్తికి కూడా అది సంతోషహేతువై ఉండితీరాలి! కానీ దైనందిన జీవితంలో మనందరకు దీనికి విరుద్ధమైన అనుభూతి కలుగుతున్నది. మన జీవితంలో సుఖశాంతులకు హేతువైన సాధనాసామగ్రి మరొకరికి మహాదుఃఖమునకు కారణభూతమౌతున్నది అనే అంశము ప్రత్యక్షంగా గోచరిస్తున్న వాస్తవము. ఒకవేళ జడపదార్థములు నిజంగానే ప్రసన్నతకు ఉద్గమస్థానమైతే అవి మరెవ్వరికీ దుఃఖమునకు హేతువు అవ్వవు! ఒకవేళ అలా అయినట్లయితే నిశ్చయంగా అది మనం అవగాహన చేసుకొనుటలో ఉన్న దోషమే! ఈ దోషమును అర్థము చేసుకొని దానిని దిద్దుకున్నప్పుడే మనము ఆ చిరంతన ఆనందమును హస్తగతము చేసుకొనగలము.

ఈ ప్రపంచములో పదార్థము – చేతన అనేవి రెండు ప్రధాన తత్త్వములు. స్థూలజగత్తులో పదార్థమే సర్వోత్తమమైనది. సూక్ష్మజగత్తులో ఆత్మ-పరమాత్మలను మించి ఉన్నతమైనది మరేదీ లేదు. రెండూ కూడా తమ తమ రీతులలో సత్యమైనవే! అయితే ఒకదానికి సంబంధించిన సత్యము వలన చేకూరే లాభము రెండవ దానిద్వారా కలుగుట అసంభవము. ఒకదాని సత్యము రెండవదానికి పర్యాయంగా నిలుచుట అన్నది శక్యము కాదు. ఆత్మలో ద్రవ్యము యొక్క గుణమును అన్వేషించుట నిరర్థకము. ఆత్మధర్మమును 'పదార్థము-ప్రపంచము'లో వెదకుట అజ్ఞానము. ప్రపంచమంతా సౌందర్యము నిండియున్నది. ఒకరికి ఆ సౌందర్యమును చూసినప్పుడు హృదయము పులకిస్తుంది. మరొకరికి అదే సౌందర్యమును గాంచినప్పుడు అటువంటి ఆనందహేళి అనుభూతిలోకి రాదు. ఒకవేళ అందము అనేది ఉన్నట్లయితే దానిని అన్వేషించే ప్రతి అన్వేషకునికి దానిద్వారా సుఖము చేకూరాలి. కానీ అలా ఎక్కడ జరుగుతున్నది? ఏ సౌందర్యముతో, భోగవిలాసముల వలన మనకు ఆనందము ఒనగూడుతున్నదో ధీమంతులు(వివేకవంతులు) దానినుండి దూరంగా ఉంటూ ఉంటారు. దానిపట్ల వైరాగ్యభావనను అవలంబిస్తారు. ఒకవేళ సౌందర్యమనేదే సత్యమైతే ఈ వైవిధ్యభరితమైన పరిస్థితి కన్పట్టకూడదుకదా! ఒక మనిషి నయనానందకరమైన సౌందర్యము మధ్య మసలుతూకూడా అసంతృప్తితో రగులుతూ ఉంటే, మరొకరు ఘోరనరకప్రాయమైన పరిస్థితులలో ఉంటూ కూడా స్వర్గసౌఖ్యానుభూతి చవిచూస్తూ ఉంటాడు. అసలెందుకు ఇలా జరుగుతోంది?

లోతుగా ఆలోచించినప్పుడు ఏ శాశ్వత సంతోషమును మనము బాహ్యంగా అన్వేషిస్తున్నామో వాస్తవానికి అది ఆంతరికమైనది అని తేటతెల్లమౌతుంది. ఒకవేళ అది బాహ్యంగా అనుభవమైతే, అది కూడా లోపలవుండేదాని యొక్క బాహ్యఅభివ్యక్తియే! మనము ఎంతగా లోతులలోపలికి చొచ్చుకుపోతూవుంటామో అంతే స్థాయిలో ఈ తథ్యము మరింత స్పష్టంగా అనుభవమౌతూ ఉంటుంది. మనము సుఖమును బాహ్యవస్తువులలో అన్వేషించాలనుకుంటాము. అసలు సుఖము అక్కడ లేనేలేదు. ఇందువలన దుఃఖమును అనుభవించాల్సివస్తుంది. ఇదంతా అవగాహనై, తెలిసివున్నప్పటికీ మనిషి ఈనాడు ప్రపంచములో శాంతికోసము సాధనాల వెనుక పరుగులుతీస్తున్నాడు. ఒక వ్యక్తి దానిని ఒకానొక వస్తువులో, పదార్థములో అన్వేషించటానికి ప్రయత్నిస్తూ ఉంటే, మరో మనిషి దానిని వేరేదానిలో వెతుకుతూ ఉన్నాడు. అందరూ ప్రయత్నశీలురే! కానీ ఈనాటి వరకు వీరిలో ఏ ఒక్కరూ కూడా ఈ సనాతనమైన సుఖమును చేజిక్కించుకోవటంలో విజయమును వరించలేదు. తన పతి సాన్నిధ్యంలో తనకు సుఖము కలుగుతుంది అని భార్య అనుకుంటే, పతిదేవుడు ఆ సుఖమును భార్య వల్ల పొందాలనుకుంటాడు. తల్లి-బిడ్డ వద్ద సుఖమును వెతుకుతూవుంటుంది. బిడ్డడు తన తల్లివద్ద సుఖాన్వేషణ కావిస్తూ వుంటాడు. తండ్రి-కుమారుని వద్ద, బిడ్డ-తండ్రి వద్ద, లోకులు ఈ ప్రపంచములో, విరాగులు-వైరాగ్యంలోనూ తమ తమ శైలిలో దీనిని అన్వేషిస్తూ ఉంటారు. కానీ ఈ అన్వేషణా యాత్ర సాగిస్తున్న మనుష్యులెవ్వరూ తమ లక్ష్యమును చేరుకోలేదు. భవిష్యత్తులో యాత్రను పూర్తిచేసి, సఫలతను సాధించుట అసంభవము! ఎందుకంటే దేనినైతే మనము సుఖమునకు స్రోతము అని భావించామో నిజానికి అది సుఖమూలము, దాని ఉద్గమస్థానము కానేకాదు.

దేనినైతే మనము శాంతిపుంజముగా భావిస్తున్నామో, దేనిలో మనము శాంతిని అన్వేషిస్తున్నామో, వాస్తవానికి అది అశాంతికరమైనది. వీరంతా శాంతిని మరో చోటున అన్వేషిస్తున్నారు అన్న విషయము విదితమైనప్పుడు ఆశ్చర్యము కలుగుతుంది. మానవ శరీరము ఒక పని చేస్తూ ఉంటే మనస్సు దేనికోసమో మరోచోటున వెతుకుతూవుంటుంది. శరీరము ఒకచోటున వుంటే మనస్సు మరో తావున తచ్చాడుతూవుంటుంది. మనస్సు తనలో తాను కుదురుకుని ఉండదు. మనస్సు సంపూర్ణ అస్తిత్వము దానిలోనే నిలిచివుండదు. ఇందువలన మనస్సును సంపూర్ణంగా ఒకచోటున పట్టుకొనలేము. కేవలము శరీరమును పట్టుకొనగలము. అయితే మనో-ప్రాణములు లేనప్పుడు శరీరము అసంపూర్ణమైనది. తృప్తిని బాహ్య ప్రపంచములో అన్వేషిస్తు ఉండే మానవుల శక్తి ఏ సమయములోనైనా అసంపూర్ణముగానే ఉంటుంది. అటువంటి మనుష్యులకు ఒక చిన్న దెబ్బతగిలితే చాలు ఒక్కసారిగా సంతులనమును కోల్పోయి పడిపోతారు. వారు అలా పడుతూ, లేస్తూనే యాత్రను సాగిస్తూవుంటారు. అలా పడిపోయినప్పుడు ఆత్మహత్య చేసుకుంటారు లేదా పిచ్చివారైపోతారు. కొద్దిపాటి తెలివున్న వ్యక్తులు నామమాత్రంగా విరాగులై ఇటూ అటూ తిరుగుతూంటారు. ఈ కారణముగానే ప్రస్తుతము పిచ్చివారు, సగం పిచ్చివారు మరియు విరాగులని పిలువబడే వారి సంఖ్య చాలా వేగంగా పెరిగిపోతున్నది. ఈనాటి మనుష్యులు లోపలినుండి బయటకు ప్రయాణిస్తున్న కారణంగా జరుగవల్సినదానికి భిన్నంగా జరుగుతున్నది. అంటే వ్యతిరేక ఫలితము వస్తున్నది.

ఈ పరిస్థితే ఒకసారి భర్తృహరికి ఎదురయ్యింది. ప్రాపంచిక విషయవాసనల ద్వారా అతనికి తిరిగి తిరిగి అసంతృప్తి, అశాంతులు పెచ్చరిల్లినప్పుడు తన అన్వేషణ తప్పుదారిలో సాగుతున్నది అని, తప్పుపద్ధతిలో జరుగుతున్నది అని అర్థము చేసుకున్నాడు. దీని తరువాత ఆయన 'శృంగారశతకము' అను పేరు గల పుస్తకమును వ్రాశారు. ఈ పుస్తకంలో ఆయన బాహ్యజగత్తులో సుఖోపలబ్ధి పొందుట వ్యర్థమని విపులంగా ప్రస్తావించారు. దీని తరువాత ఆయన అంతర్యాత్ర మొదలయ్యింది. ఆయన తన అనుభవాలకు 'వైరాగ్యశతకము' అనే పుస్తకంలో అక్షరరూపునిచ్చారు. స్థిర ఆనందము యొక్క లాభము ఆంతరికము-ఆత్మికము అని వ్రాక్కుచ్చారు.

ఇలాంటి భావాలనే వెల్లడిస్తూ మూర్ధన్యమనీషి జంగ్ 'మోడరన్ మేన్ ఇన్ సెర్చ్ ఆఫ్ ఆ సోల్' అనే పుస్తకంలో ఇలా వ్రాశారు. ఆరంభంలో మానవ సంబంధమైన అభిప్రాయము ఎలా ఉండేదంటే తాను కేవలము శరీరమేనని, ఈ ప్రపంచమంతా తాను అనుభవించటానికే ఉన్నదని భావించాడు. అటువంటి స్థితిలో మనిషి సాధనాసామగ్రులలో తుష్టిని అనుసంధానిస్తాడు. దానిని అధికాధికంగా అనుభవించటములోనే మునిగివుంటాడు. ఈనాడు శరీరము లోపల ఆత్మ యొక్క ఉనికిని విజ్ఞానము దాదాపుగా అంగీకరించినది. అటువంటప్పుడు తద్వారా పొందిన ఫలితము చేత సంపూర్ణ-శాశ్వతమైన సుఖ ఫలితము కలిగి, మనిషి ప్రథమస్థితిలో వలె దారితప్పి తిరుగాడకుండా ఉండుట అన్నది సంభవమే! ఇందువలన శాస్త్రవేత్తలిలా సలహా నిస్తున్నారు. ఒకవేళ నిజంగా మనిషి అంతరంగము లోతుల లోలోపల ఒక అద్భుత తత్త్వముంటే, ఆ తత్త్వమును పొందటమే మానవుని చరమలక్ష్యము. దానిని పొందితే మనిషి సమస్తమూ పొందినట్లే! ఇక పొందవల్సినది ఏమీ ఉండదు. కనుక మనిషి ఆ పరమతత్త్వమును అన్వేషించుటలో మునిగి, చివరకు ఫలితమును సాధించాలి.'

'స్పిరిట్యువల్ క్రైసిస్ ఆఫ్ మ్యాన్' అను పేరు గల గ్రంథంలో ప్రఖ్యాత పరిశోధకుడు, విశ్లేషకుడు పాల్‌బ్రంటన్ ఇలా అన్నాడు. 'వాస్తవానికి అధ్యాత్మ అన్వేషణ తన అంతరంగ అన్వేషణయే! మరోవైపు ప్రపంచము జడ-పదార్థాల అనుసంధాన యాత్ర! విజ్ఞానము జడముతో కల్సియున్నది. అధ్యాత్మము చేతనామయమైనది. జడమును-జడపదార్థములతోనే అన్వేషించాల్సివుంటుంది. దానిద్వారా పొందినవన్నీ జడమయములే అవుతాయి. మరోవైపు చూసినట్లయితే ఆనందమనేది దివ్యచేతనాత్మకస్థితి! ఇది ఆత్మ యొక్క స్వాభావికమైన గుణము! ఆత్మ-చైతన్యమయము! అటువంటప్పుడు అధ్యాత్మజగత్తులో 'సచ్చిదానందము' అను పేరిట నిరూపితమైన అవస్థలో స్థిరంగా నెలకొని ఉండటము అనేది ఆత్మను పొందిన కారణముగానే సాధ్యపడుతుంది.' అతను ఇంకా ఇలా అన్నాడు. ఈనాడు జడములో చేతనత్వమును వెదకుట, అలాగే పరాప్రకృతిని-అపరాప్రకృతిలో వెదకుట అనే రెండు తప్పులు దొర్లుతున్నాయి. అయితే ఇవి రెండూ రెండు భిన్నమైన విజ్ఞానశాస్త్రములు. ఈ నిరర్థక ప్రక్రియ అంతమైన రోజునుండి మానవుని నిజమైన ఆధ్యాత్మిక యాత్ర మొదలౌతుంది. అప్పుడు మనిషికి శాంతి సంతోషముల కొరకు బయట వెదకుతూ తచ్చాడాల్సిన అవసరము ఉండదు.

దీనికొరకు ఒక ఉపాయమున్నది. భగవంతుడు మనకు ప్రసాదించిన వాటితో మనము సంతోషంగా జీవించటము నేర్చుకోవాలి! మెల్లమెల్లగా సంతోషమును పెంచుకుంటూపోవాలి! దానిని వస్తుసంపదతో కలుపరాదు! అలా చేసినప్పుడు ఒకానొకరోజున సహజానందం అని పిలువబడే ఆ ఉన్నతస్థితిలోకి అడుగుపెట్టగలము. ఇది ఉచ్చ ఆధ్యాత్మికస్థితి! ఆ స్థితిలో ఆనందమగ్నులమై జీవించటము స్వభావంగా మారుతుంది. అప్పుడు మనము సాధనాహీనులమా లేదా సాధనాసంపన్నులమా? అను రెండు విషయాలలో ఏ తేడా గోచరించదు. పైన చెప్పిన ఉన్నత మానసికతకు లేక మనోదశను పొందుటకు భౌతికజగత్తుతో ఏవిధమైన సంబంధమూ ఉండదు అనేది సత్యము! ఇదొక అభౌతికావస్థ. అంటే భౌతికతతో సంబంధము లేని స్థితి. ఇది తప్పక పొందతగినదేసుమా! దీనికి వ్యతిరేకంగా ఒకవేళ మనము సాధనా సామగ్రులతో సుఖసంతోషములు కలిసుంటాయని భావిస్తే వాటిద్వారా వచ్చే దుఃఖము కూడా జీవితంలో మనతోపాటే కల్సి సాగుతూనే

ఉంటుంది. అది కష్టకారకమైనది, దుస్సహనీయమైనది. ఇందువలన బుద్ధిమంతులైన మనుష్యులు సుఖమును సాధనాసామగ్రులతో జోడించి చూడరు. ఎందుకంటే ఈ ప్రపంచము నశ్వరమని వారికి తెలుసు. ఈ ప్రపంచము నశ్వరమైనది, దాని ద్వారా ఉత్పన్నమైన సమస్త వస్తువులు నశించిపోయేవే అయినప్పుడు వాటిచేత పొందిన సుఖము శాశ్వతముగా ఎలా ఉంటుంది? అందుచేత తత్త్వవేత్తలు భగవంతుడిని ప్రేమ–స్వరూపునిగా చెప్పారు. మన ఆత్మ–ఆయనలోని ఒకానొక అంశ. ఆత్మపరిష్కారము ద్వారా ఆత్మ మరియు పరమాత్మలను పొందుట, వాటిని ఏకస్వరూపము కావించుటయే అధ్యాత్మము యొక్క ఉద్దేశ్యము. ఆ స్థితిలోనే సర్వోచ్చశాంతి, పరమానందములను పొందగలము. మనందరి ప్రయత్నము ఈ లక్ష్యసిద్ధికై ముందుకు సాగుతూ ఉండాలి.

శ్రీమతి లక్ష్మీరాజగోపాలు